ప్రభాత

# ఉదయం

తెలుగు దినపత్రిక



## ఆర్టికల్ 370 పునరుద్ధరిస్తాం

### సీఏఏ, ఉగ్రవాద వ్యతిరేక చట్టాల రద్దు

### సీపీఎం పార్టీ మేనిఫెస్టో విడుదల

2లో..

సంపుటి: 1 | సంచిక: 360 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



### రాజ్యసభ సభ్యురాలిగా

## సోనియా ప్రమాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): రాజ్యసభ సభ్యురాలిగా సోనియా గాంధీ ప్రమాణం చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌కడ ప్రమాణం చేయించారు. ఇన్నాళ్లు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ సారి లోక్‌సభ ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్నారు. వయసు రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ తరవాత ఆమెని కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎంపిక చేసింది. 77 ఏళ్ల వయసులో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం కష్టమని భావించిన ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. యూపీలోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ ఎంపీగా ఐదుసార్లు ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్‌కి ఈ నియోజకవర్గం కంచుకోటలాంటిది. అయితే...ఈ సారి ఇక్కడ ఎవరిని బరిలోకి దింపాలన్న తర్జనభర్జన కొనసాగుతోంది. కాంగ్రెస్‌కి సొంతమైన ఈ నియోజకవర్గంలో ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది బీజేపీ. లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కి వచ్చిన ఒకే ఒక సీటు రాయ్‌బరేలి మాత్రమే. ఇప్పుడు అది కూడా దక్కకుండా పోతుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోనియా ప్రమాణ స్వీకారంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.

## జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

### జయంతి సందర్భంగా స్మరించుకున్న సీఎం రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని బాబూజీ సేవలను సీఎం రేవంత్ స్మరించుకున్నారు. అత్యంత పేదరికంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని పేర్కొన్నారు. జాతీయోద్యమం లో పాల్గొన్న ఆయన రాజ్యాంగ పరిషత్ సభ్యునిగానూ సేవలందించారని, స్వాతంత్యాన్రం తరం తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన బాబూజీ రెండు దఫాలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగానూ సేవలు అందించారని తెలిపారు. దేశవ్యాప్తంగా కరవు తాండవిస్తున్నప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారని, దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని సీఎం పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ

# కాంగ్రెస్‌కే సాధ్యం

### బిఆర్ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదు

### గత పాపాలకు బాధ్యత లేదన్నట్లుగా బిఆర్ఎస్ వైఖరి

### వ్యక్తిగత, రాజకీయ అవసరాలకు ట్యాపింగ్ దుర్వినియోగం

### బిఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ చేయదు

### తెలంగాణలో 12 నుంచి 14 సీట్లు గెలవబోతున్నాం

### తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ సమరశంఖం పూరిస్తాం

### డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకైక దిక్కు కాంగ్రెస్ మాత్రమేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అవాస్తవాలు మాట్లాడే బీఆర్ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదని ఎద్దేవా చేశారు. 10 ఏళ్లు పాలించిన బీఆర్ఎస్ నాయకులు గత పాపాలకు బాధ్యత లేదంటే ఎలా అని నిలదీశారు. దేశ భద్రతకు వాడాల్సిన కమ్యూనికేషన్ వ్యవస్థను కేసీఆర్, కేటీఆర్ వ్యక్తిగత అవసరాలకు వినియోగించారని ధ్వజమెత్తారు. తుక్కుగూడలోని ' జన గర్జన' సభ ఏర్పాట్లను గురువారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కదం తొక్కుదాం.. కాంగ్రెస్ తడాఖా దేశానికి చాటుదామని పిలుపునిచ్చారు. తుక్కుగూడ ' జన గర్జన' సభ ఈ దేశానికి దిశానిర్దేశం చేయ నుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను తుక్కుగూడ సభ నుంచే ఏఐసీసీ నాయకత్వం ప్రకటించనుందని తెలిపారు. వ్యక్తిగత కుటుంబ జీవితాలు, వ్యాపారాలు, అధికారులు, జడ్జీలు ఏం మాట్లాడుకుంటున్నారో నిబంధనలకు

..మిగతా 2లో



### ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

## మరో కీలక మలుపు

### లోతైన దర్యాప్తుతో వెలుగులోకి సంచలన విషయాలు

### ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలోనూ ట్యాపింగ్

### రాధాకిషన్ రావు కనుసన్నల్లో మొత్తం వ్యవహారం

### ఫలితాల తరవాత హార్డ్ డిస్క్‌ల ధ్వంసం

### వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఈ వ్యవహారం రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. కేసు లోతుల్లోకి వెళ్లేకొద్దీ.. సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫాంహౌస్ ఎపిసోడ్ తెరపైకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్ సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. గురువారం నాడు ఆయన మీడియాకు పలు విషయాలను వెల్లడించారు. మాజీ డీసీపీ రాధ కిషన్ రావు పోలీస్ కస్టడీపై కోర్టు అనుమతితో ఆయనను తిరిగి కస్టడీలోకి

..మిగతా 2లో



## నేత కార్మికులపై కాంగ్రెస్ కక్ష

### వారి ఉపాధిపై దెబ్బకొట్టిన సర్కార్

### కాంగ్రెస్ రాకతో చీకట్లు అలముకున్నాయి

### వెంటనే ఆదుకునే ఏర్పాట్లు చేయాలి

### సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కక్ష కట్టిందని, ఎందుకింత కక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా?... కార్మికులు రోడ్డున పడ్డా కనికరించరా?.. అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల తరువాత సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం తెలంగాణలో ఏర్పడిందని అన్నారు. నేతన్నల బతుకులు ఆగం అయ్యేలా కాంగ్రెస్ విధానాలు ఉన్నాయని, నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్డర్లు అపేసిందని మండిపడ్డారు. గతంలో మాదిరిగా నేతన్నలకు చేతినిండా అర్డర్లు వేంటనే ఇవ్వాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని.. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అవసరం అయితే మరింత సాయం చేయాలని సూచించారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతతో నేతన్నల

..మిగతా 2లో

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

### సీఎం పదవి తొలగించాలన్న పిటిషన్ తిరస్కరణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తిహార్ జైలులో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టులో ఊరట లభించింది. జైలులో ఉన్న ఆయనను సీఎం పదవి నుంచి తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం రోజున తిరస్కరించింది. సీఎం పదవిలో కొనసాగాలా వద్ద అనే అంశం కేజ్రీవాల్ వ్యక్తిగతంగా నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది కోర్టు తెలిపింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ కస్టడీలో ఉన్నందున కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ వారం రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది.హిందూ సేన జాతీయ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త విష్ణు గుప్తా ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ అంశంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. దీనిపై దిల్లీ లెప్టినెంట్ గవర్నర్ లేదా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని

..మిగతా 2లో



## రాహుల్ ఆస్తుల విలువ 20 కోట్లు

### సొంత ఇల్లు, వాహనం లేదని అఫిడవిట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ సీనియర్ రాహుల్ గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేయనున్నారు. బుధవారం ఆయన నామినేషన్‌తో పాటు ఆఆస్తులకు

..మిగతా 2లో



## రారెత్తిస్తున్న ఎండలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు కూడా భయపడుతున్నారు. ఈ ఎండాకాలం బయటపడేదెలా అని ఆలోచిస్తున్నారు. ప్రచారానికి వేకువ జామునే వెళుతున్నా మధ్యాహ్నం అయితే గానీ రరావడం కుదరడం లేదు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు మండు వేసవిని తలపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పగటి ఉ ష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. వడగాడ్పుల తీవ్రత పెరిగింది. మరో నాలుగు రోజల పాటు ఇదే విధమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని వాతవారణ శాఖ అధికారులు వెల్లడించారు. మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకూ చిన్న పిల్లలు , వృద్దులు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి

..మిగతా 2లో

# ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌కే సాధ్యం

మొదటి పేజీ తరువాయి...

విరుద్ధంగా బీఆర్ఎస్ నేతలు తెలుసుకున్నారని విరుచుకుపడ్డారు. జూన్ మాసంలో వచ్చిన వర్షాలను కేసీఆర్ ఒడిసి పట్టలేదన్నారు. అవసరం లేకున్నా గొప్పల కోసం నాగార్జున సాగర్ నీటిని కిందికి ఎందుకు వదిలారని ప్రశ్నించారు. 64.75 లక్షల మంది రైతులకు రైతుబంధును రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రైతుబీమా కింద రూ. 1500 కోట్ల ప్రీమియం ప్రభుత్వమే చెల్లించిందని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు అందజేస్తున్నామని చెప్పారు. 30 వేల ఉద్యోగాలను మూడు నెలల్లో ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు వరంగల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు తుక్కుగూడ సభకు కదలి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చేతగాని తనం వల్లే తెలంగాణలో నీటి ఎద్దడి వచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. వర్షాకాలంలో పడిన వర్షాల కారణంగా వచ్చిన నీటిని వడిసి పట్టుకోకుండా ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు నీటిని ఎందుకు అందించడం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అయినా రాష్ట్రంలో నీటి సమస్య ఉండకూడదని యుద్ధ ప్రాతిపదికన పనిచేసి నీటి సమస్య లేకుండా చేశామని చెప్పారు. పొలాల్లో పెట్టే దిష్టి బొమ్మల వలే పొలాల వెంట మాజీ సీఎం కేసీఆర్ తిరుగుతూ నీళ్లు అందించలేదని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దశాబ్ద కాలంలో కాంగ్రెస్ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 12 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో గతంలో ఉన్నవారు కూడా కాంగ్రెస్ నాయకులేనని బీఆర్ఎస్ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కాంగ్రెస్‌కి పోటీనే కాదని భట్టివిక్రమార్క చెప్పారు. దేశంలో బీజేపీ పతనం మొదలైందన్నారు. యువత భవిష్యత్ దృష్ట్యా ఆచి తూచి ఓటు వేయాలని కోరారు. మనందరి భవిష్యత్ వచ్చే



పార్లమెంట్ ఎన్నికల్లో మనం వేసే ఓటు మీద ఆధారపడి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను, వనరులను అల్లకల్లోలం చేసిన దుర్మార్గపు పార్టీకి ప్రజలు గుణ పాఠం చెప్పారన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎవరినైనా ప్రశ్నించాలంటే భయం, రాయాలంటే భయపడే పరిస్థితుల నుంచి ప్రతి పౌరుడు ఓటు వేసి ఆ పార్టీని బొంద పెట్టారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని కరెంట్ సమస్యలు రాకుండా మెరుగైన విద్యుత్ అందిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి దగ్గర నుంచి మొదలు పెడితే తనతో పాటు ప్రతి మంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ వలే రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టం, పెట్టలేమన్నారు. సీఎం, మంత్రులు ఎవరు ఢిల్లీ వెళ్లిన ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలకు కావాల్సిన నిధులు తీసుకు రావడానికేనని వివరించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కావాల్సిన పనులకు అడ్డంకులు ఉంటే సీఎం రేవంత్ వెంటనే ఆ అడ్డంకులు తొలగించారని చెప్పారు. 10 ఏళ్ల నుంచి అభివృద్ధి పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలేస్తే వాటిని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కేవలం మూడు నెలల్లో ఏయే శాఖల్లో పెండింగ్ పనులు ఉన్నాయో ఆ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మ్మం జిల్లా సింగరేణి పుట్టిన ప్రాంతం, ఈ రోజు సింగరేణి గానీ, అత్యంత విద్యుత్ వెదజల్లే ప్రాంతమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా రవాణా ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నార న్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పని చేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుక్కుగూడ లో బహిరంగ సభ ఏర్పాటు చేసి 6 గ్యారెంటీలు ప్రకటించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. ఇప్పుడు అదే ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి దేశంలో అమలు చేసే గ్యారెంటీల గురించి ఏఐసీసీ అగ్ర నేతలు ప్రకటిస్తారని అన్నారు. బహిరంగ సభను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి విజయవంతం చేయాలని భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు.

# నేత కార్మికులపై కాంగ్రెస్ కక్ష

మొదటి పేజీ తరువాయి...

పొట్ట కొట్టడం సరైంది కాదన్నారు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరమని, వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ సర్కార్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ అన్నారు. ఈ పదేండ్లలో నేతన్నలకు చేతి నిండా పని కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమైక్య రాష్ట్రంలో నాటి సంక్షోభం నెలకొందని ఆయన పేర్కొన్నారు. నేతన్నలకు ఆర్డర్లు ఆపడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాదిరే నేతన్నలకు చేతి నిండా పని కల్పించాలని కోరారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలి. అవసరమైతే మరింత సాయం చేసి ఆదుకోవాలన్నారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరం. వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. మీ కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాగులునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. మీ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతోపాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డున పడటంతో.. పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా మీ ప్రభుత్వానికి కనీస కనికరం లేదు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మిక లోకం.. ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో.. ఏదో ఒక రూపంలో తమ ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ మీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం అత్యంత దారుణమైన విషయం. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థయిర్యాన్ని మరింత దెబ్బతీస్తోంది. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం ప్రతి కార్మికుని గుండెను గాయపరిచింది. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారు. నేతన్నలపైనా కాంగ్రెస్ కున్న చిన్న చూపు ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది.

కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చిన మీకు ఒక్క సారి గతం గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాను. సరిగ్గా ఇవే పరిస్థితులు సమైక్యరాష్ట్రంలో నెలకొని ఉండేవి. తెలంగాణ సాధించాక పాలనా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ గారు తెలంగాణలో నేతన్నలను, వస్త్ర పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. చిక్కిశల్యమైన ఈ పరిశ్రమను ఆదుకోవడానికి స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి ఒక రోజంతా అధికారులతో కలిసి అప్పటి సీఎం కేసీఆర్ గారు సమీక్ష నిర్వహించారు. నేతన్నల వేతనాలను, కూలీలను రెట్టింపు అయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు 15 నుంచి 20 వేలు సంపాదించుకుని గౌరవప్రదంగా జీవించేందుకు పటిష్టమైన కార్యాచరణను రూపొందించారు. అనేక వినూత్నమైన సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారు. చేనేత మిత్రా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలు ప్రారంభించాము. వీటి కోసం భారీ ఎత్తున గత 60 ఏండ్లలో ఎప్పుడు లేనంత బ్జడెట్ కేటాయించాము. గతంలో ఇతర రాష్ట్రాలనుంచి సరఫరా అయ్యే, రాజీవ్ విద్యా మిషన్, సర్వశిక్ష అభియాన్ కార్యక్రమాల ఆర్డర్లను రాష్ట్రంలోని నేతన్నలకు ఇచ్చి, చేతి నిండా పని కల్పించింది నాటి ప్రభుత్వం. దీంతో అప్పటిదాకా ఉపాధి లేక అల్లాడిన కార్మికులకు పని లభించింది. సంప్రదాయంగా వస్తున్న వృత్తిని కొనసాగిస్తూనే పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు కూడా ప్రభుత్వం తోడ్పాటునందించింది. మగ్గాల అధునీకీకరణ, రుణాల మాఫీ, మార్కెట్ తో అనుసంధానం వంటి అల్ రౌండ్ అప్రోచ్ తో ముందుకు సాగింది. వీటన్నింటి వలన కార్మికులకు ఉరట లభించడంతో, వీరికి మరింత పని కల్పించడంతోపాటు, కడుపునిండా అన్నం పెట్టేలా బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన బతుకమ్మ చీరల పథకం ప్రారంభించింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు కూడా అందించడంతో.. కార్మికులకు చేతి నిండా పని దొరికింది. దీంతోపాటు.. రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా వారికి ఇవ్వడంతో కార్మికులకు మరింత ఉపాధి పెరిగింది. ఇలా ఏడాదికి దాదాపు ఎనిమిది నెలల వరకూ వరుస ఆర్డర్లు అందడంతో.. సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసింది. పవర్ లూమ్ లను ఆధునీకరించుకునేందుకు సబ్సిడీపై రుణాలు కూడా ఇవ్వడంతో వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన జీవితాల్లో కొత్త వెలుగులు నింపినట్టయింది. నేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సాగిన ఆ మహాయజ్ఞం ఎన్నో గొప్ప ఫలితాలను ఇచ్చింది. తెలంగాణలో వస్త్రపరిశ్రమ విస్తరించి ఉన్న వివిధ ప్రాంతాలతోపాటు.. కాంగ్రెస్ తోపాటు గత ప్రభుత్వాల పాలనలో ఒకప్పుడు ఉరిశాలగా ఉన్న సిరిసిల్ల కొత్త కాంతులతో వెలుగులీనింది. వీటికి తోడు నేతన్నకుభీమా అమలుచేయడంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించింది. వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో కార్మికలోకంలో కొనుగోలు శక్తి కూడా పెరిగింది.. ఓవైపు కార్మికుల సంక్షేమం, మరోవైపు సమగ్ర అభివృద్ధితో వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చింది. పవర్ లూమ్ కార్మికులు అధికంగా ఉండే? కరీంనగర్, సిరిసిల్లతోపాటు.. వరంగల్, ఇతర ప్రాంతాల్లోని కార్మికులకు కూడా బీఆర్ఎస్ హయాంలో కోట్ల విలువైన ఆర్డర్లు ఇవ్వడంతో.. వస్త్ర పరిశ్రమకున్న అన్ని సమస్యలు తొలగిపోయాయి. మళ్లీ కాంగ్రెస్ రాగానే చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి.. పరిశ్రమను దెబ్బతీయడం తో పాటు.. కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న మీ కాంగ్రెస్ సర్కారు వెంటనే తన తీరు మార్చుకోవాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను భేషజాలకు వెళ్లకుండా కొనసాగించాలి. మాప్రభుత్వం ఉన్నప్పుడు నెల నెలకు కార్మికుల ఖాతాల్లో నేరుగా సూమారు 3000 రూపాయాల వరకు పడేవి. ఈ ప్రభుత్వం వచ్చాకా చేనేత మిత్రా కార్యక్రమం అగిపోయింది. మూలన పడిన సాంచాలను తిరిగి తెరిపించడానికి.. పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్లు బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మరోవైపు సొంత రాష్ట్రంలోని కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు కమిషన్లకు కక్కుర్తి పడి.. తమిళనాడుకు, సూరత్ కు ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. రైతాంగ సంక్షోభాన్ని చూసినట్టు నేతన్నల సంక్షోభాన్ని కూడా రాజకీయ కోణంలో కాకుండా.. పేద బడుగు, బలహీన వర్గాలైన నేతన్నల కోణంలో ఆలోచించి వెంటనే పరిష్కరించాలని రాష్ట్రంలోని నేత కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

# మరో కీలక మలుపు

మొదటి పేజీ తరువాయి...

తీసుకున్నామని చెప్పారు. 10 తేదీ వరకు టాస్క్ ఫోర్స్ రాధా కిషన్ రావును విచారిస్తుందని వెస్ట్ జోన్ డీసీపీ తెలిపారు. ఈ కేసులో ఆయన నుంచి చాలా విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని డీసీపీ తెలిపారు. ఎస్ఐబీలో హార్డ్ డిస్క్‌ల ధ్వంసం కేసులో కుట్రధారుడిగా రాధాకిషన్ రావు ఉన్నారని చెప్పారు. ఈ కేసులో కొంతమంది ప్రముఖుల ప్రొఫైళ్లను అనధికారకంగా తయారుచేసి అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు.ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించి పలువురి ప్రొఫైల్లని రాధాకిషన్ రావు తయారు చేశాడని వెస్ట్‌జోన్ డీసీపీ వెల్లడించారు. ఆయన బెదిరింపులకు పాల్పడి ఒక పార్టీకి డబ్బులు చేరే విధంగా చేశాడన్నారు. కాంగ్రెస్‌కి అనుకూలంగా ఫలితాలు రావడంతో హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయించాడన్నారు. ఎస్ఐబీలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకి రాధాకృష్ణ సహకరించాడని చెప్పారు. పలువురి ప్రొ÷ల్స్‌కు సంబంధించిన వ్యవహారాలను బయటకు రాకుండా ఉండటానికి ఆధారాలను ధ్వంసం చేశారని వెస్ట్ జోన్ డీసీపీ తెలిపారు. కాగా.. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులోమాజీ డీసీపీ రాధ కిషన్ రావు పాత్ర ఉన్నట్లు విచారణలో తేలింది. ఫాంహౌస్ ఎపిసోడ్ పూర్తిగా ఫోన్ ట్యాపింగ్ వల్లే జరిగినట్లు హైదరాబాద్ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫాంహౌస్‌లో ఆపరేషన్ కంటే ముందు రాధ కిషన్ రావు 74 డివైసులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆయన నేతృత్వంలోనే ఎమ్మెల్యేల కొనుగోలు ఎపిసోడ్ నడిచినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం రాధ కిషన్ రావు పరిధిలో లేకపోయినా గత కేసీఆర్ ప్రభుత్వం ఆయన కనుసన్నుల్లోనే నడిపించినట్లు తెలుస్తోంది. నంద కుమార్ ఫోన్ ట్యాపింగ్ చేసి ఫాంహౌస్ ఎపిసోడ్‌కు రాధ కిషన్ రావు స్కెచ్ వేసినట్లు సమాచారం. ఈ కేసులో భాగంగానే సీసీటీవీ కెమెరాలను ఐటీ ఇన్‌స్పెక్టర్ జూపల్లి రమేష్ రావు మానిటరింగ్ చేసినట్లు తెలుస్తోంది. రాధ కిషన్ రావుని కస్టడీకి అనుమతిస్తే మొదట ఫాంహౌస్ కేసుపై హైదరాబాద్ పోలీసులు విచారించే అవకాశాలు ఉన్నాయి. సీసీటీవీ కెమెరాలు, స్పై కెమెరాలు, వాయిస్ రికార్డర్లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైస్‌ను రాధ కిషన్ రావు ఏర్పాటు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మునుగోడు ఉపఎన్నికల హడావుడిలో ఉన్న సమయంలో హైదరాబాద్ లో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులకు సంబంధించి వ్యక్తులను అరెస్టు చేసిన కేసులో సంచలన విషయం వెలుగు చూసింది. ఈ కేసుకు మూలం ఫోన్ ట్యాపింగేనని కస్టడీలో ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్ రావు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు రావు గువ్వల బాలరాజు, రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, బీరం హర్షవర్ధన్ రెడ్డిల ఫోన్లు ట్యాప్ చేశారు. వారు బీజేపీ తో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలియగానే.. ప్రణీత్ రావు ప్రభుత్వ పెద్దలకు తెలియచేసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత రాధాకిషన్ రావుతో కలిసి స్పెషల్ ఆపరేషన్ కు ప్లాన్

చేశారని భావిస్తున్నారు. నందకుమార్ తో పాటు స్వామిజీని .. అప్పటి తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ కు పిలిపించారు. అంతకు ముందే ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ హైకమాండ్ ఈ అంశంపై మాట్లాడింది. బేరాల గురించి మొత్తం తెలిసిపోయిందని.. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేందుకు సహకరించాలని సూచించినట్లుగా తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టిక్కెట్లు ఆఫర్ చేయడంతో వారు అంగీకరించిటన్లుగాతెలుస్తోంది. రోహిత్ రెడ్డికి తెలిసే ఆయన ఫామ్ హౌస్‌లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాప్ కెమెరాలను రాధాకిషన్ రావు అండ్ కో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. చివరికి అనుకున్నట్లుగా ట్రాప్ చేశారు. పట్టుకున్నారు. ఈ కేసు సంచలనం అయింది. ఈ కేసులో ఎమ్మెల్యేలతో బేరాలాడి పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కేరళకు చెందిన తుషార్ తో పాటు బీజేపీ ముఖ్య నేత బీఎల్ సంతోష్ పేరు కూడా తెరపైకి వచ్చింది. దీంతో వీరిద్దరిని అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించారు. ఈ కేసు విచారణకు సీఎం కేసీఆర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సిట్ బృందం నోటీసులు ఇవ్వడానికి ప్రత్యేక విమానాల్లో వెళ్లింది. విచారణ సందర్భంగా అధికారులు విమానాల్లో ప్రయాణించడం కామనే అయినా కేవలం నోటీసులు ఇచ్చేందుకు ప్రత్యేక విమానం వినియోగించడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇక ఆ ప్రత్యేక విమానం బీఆర్ఎస్ నేతకు చెందినదిగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రత్యేక విమానంలో అధికారులు ఢిల్లీ, కేరళకు వెళ్లారు. బీఎల్ సంతోష్, తుషార్‌కు నోటీసులు ఇవ్వడానికి స్పెషల్ ఫ్లైట్ ను వీరు వినియోగించారు.

ఈ కేసు బయటపడిన తర్వాత చాలా రోజుల పాటు ఆ నలుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్ వెంటనే ఉన్నారు. ఫామ్ హౌస్ లోనే నెల రోజుల పాటు ఉన్నారు. తర్వాత ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ.. కోర్టు నిర్ణయం తీసుకుంది. సీఎంగా ఉన్న కేసీఆర్ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడించారని. అవి ఎలా లీక్ అయ్యాయో తేలాల్సి ఉందన్నారు. అయితే సీబీఐకి ఈ కేసును అప్పగించడంపై తెలంగాణ సర్కార్ సుప్రీంకోర్టుకు వెళ్లింది. స్టే ఆదేశాలు లేకపోయినప్పటికీ.. సీబీఐ విచారణ ప్రారంభించలేదు. ఆ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. తర్వాత జరిగిన ఎన్నికల్లో ఈ ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా విజయం సాధించలేదు.




# ఆర్టికల్ 370 పునరుద్ధరిస్తాం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీపీఎం పార్టీ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే చట్టవ్యతిరేక కార్యకలాపాల(నివారణ) చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం వంటి కఠినమైన చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రకటించిన మేనిఫెస్టోలో పౌరసత్వ సవరణ చట్టంని కూడా రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. బీజేపీని ఓడించాలని, వామపక్షాలను బలోపేతం చేయాలని, కేంద్రంలో ప్రత్నామ్నాయ లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం ఓటర్లను కోరింది. పార్టీ తన మేనిఫెస్టోలో రాజకీయాల నుంచి మతం వేరు అనే సూత్రానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. క్రూరమైన చట్టాల రద్దుకు సీపీఎం అండగా నిలుస్తుందని ప్రకటించింది. ద్వేషపూరిత ప్రసంగాలు, నేరాలకు వ్యతిరేకంగా చట్టం తీసుకువచ్చేందుకు పోరాడుతామని తెలిపింది. అతి సంపన్నులపై పన్ను విధిస్తామని, సాధారణ సంపద పన్ను, వారసత్వ పన్నుపై చట్టాన్ని ప్రవేశపెడతామని హామీ ఇచ్చింది. ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్ కేటాయింపులు తప్పనిసరిగా రెట్టింపు చేయాలని మరియు పట్టణ ఉపాధికి హామీ ఇచ్చే కొత్త చట్టాన్ని తప్పనిసరిగా చట్టబద్ధం చేయాలని పార్టీ పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ, రాష్ట్రాల హక్కులకు హామీ ఇవ్వడంతో పాటు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, ఎన్నికల సంస్కరణలు చేస్తామని పేర్కొంది. కేంద్రం విధించే సర్‌ఛార్జీలు మరియు సెస్‌ల వాటాతో సహా మొత్తం కేంద్ర పన్నుల వసూళ్లలో 50 శాతం రాష్ట్రాలకు పంపిణీ చేస్తామని పేర్కొంది. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన ముగ్గురు వ్యక్తుల ప్యానెల్ ఆధ్వర్యంలో గవర్నర్ ఎంపిక చేస్తామని చెప్పింది. దేశంలో ఓబీసీలపై కులగణన నిర్వహిస్తామని, మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ తక్షణమే అమలు చేస్తామని, నేరాల బాధితులైన మహిళలకు న్యాయప్రక్రియను బలోపేతం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ విరాళాలనను నిషేధిస్తామని చెప్పింది.

# కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి...

జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోడాతో కూడిన బెంచ్ తెలిపింది. దీంతో జైలు నుంచే బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కేజ్రీవాల్‌కు కలిగింది. కాగా ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ పిల్ దాఖలు కావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. . సూరజ్ సింగ్ యాదవ్ అనే వ్యక్తి మార్చి28న పిటిషన్ దాఖలు చేయగా దానిని న్యాయస్థానం కొట్టివేసింది.

# ఠారెత్తిస్తున్న ఎండలు

మొదటి పేజీ తరువాయి...

బయటకు రావద్దని సూచిస్తున్నారు. వ్యవసాయ రంగంలో ప్రత్యేకించి ఆరుబయట పంట పొలాల్లో పనిచేసే రైతులు, రైతు కూలీ లు తగిన జాగ్రత్తలు తీసుకోవలని హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు వేడిగాలుల కారణంగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉం దని, వ్యవసాయ పనులు ఉదయం 11లోపు ముగించాలని, అదేవిధంగా తిరిగి సాయంత్రం మూడుతర్వాత కొనసాగించు కోవచ్చని సూచిస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూర్‌లో అ త్యధికంగా 43.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైం ది. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన వాతవరణం నెలకొంది. టీక్యాతాండా, ధరూర్‌లో 43.4, పెబ్బేర్‌లో 43.3, నాంపల్లిలో 43.2, కొరటపల్లి, బుగ్గబావిగూడ, తిరుమలగిరి కేంద్రాల్లో 43.1,వడ్డేపల్లిలో 43,కోనైపల్లి ,ఇబ్రహింపట్నం, 42.9డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయిలో గాలులు దక్షిణ , ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల నాలుగు రో జుల్లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2నుండి 3డిగ్రీల వరకూ పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రాగల 24గంటల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని ,ఉష్ణోగ్రతలు గరిష్టంగా 39డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

# రాహుల్ ఆస్తుల విలువ 20 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

సంబంధించిన అఫిడవిట్ దాఖలు చేశారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.20 కోట్లు. సొంత వాహనం,ప్లాట్ లేవని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ రూ.20 కోట్లలో చరాస్తులు రూ.9.24 కోట్లు. ఇందులో రూ.55 వేల నగదు, రూ.26.25 లక్షల బ్యాంకు డిపాజిట్‌లు, బాండ్‌లు, షేర్‌ల విలువ రూ.4.33 కోట్లు, మ్యూచ్యువల్ ఫండ్స్ విలువ రూ.3.81 కోట్లు, రూ.15.21 లక్షల విలువైన గోల్డ్ బాండ్స్, రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలున్నట్టు అఫిడవిట్‌లో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఇక స్థిరాస్తుల విషయానికొస్తే...వీటి విలువ రూ.11.15 కోట్లుగా ఉంది. ఢిల్లీలోని మెహరౌలీలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీ కలిసి కొనుగోలు చేశారు. గురుగావ్‌లో సొంతగా ఆఫీస్ ఉందని అఫిడవిట్‌లో తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.9 కోట్లుగా ఉంది. అయితే...ఈ భూమి వారసత్వంగా వచ్చినట్టు వివరించారు. తనపై ఉన్న పోలీస్ కేసుల గురించీ అందులో ప్రస్తావించారు. ఇందులో ఓ పోక్సో కేసు కూడా ఉంది. సోషల్ మీడియాలో అత్యాచార బాధితారులి కుటుంబ సభ్యుల వివరాలు బయట పెట్టినందుకు ఈ కేసు నమోదైంది. బీజేపీ నేతలు వేసిన పరువు నష్టం దావా కేసులూ ఆయనపై ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ వయనాడ్ నుంచే పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి ఆయనకు పోటీగా సీపీఐ నేత అన్నీ రాజా, బీజేపీ చీఫ్ కే సురేంద్రన్ బరిలోకి దిగారు.

# సందేశ్‌ఖాళీ ఘటనపై హైకోర్టు ఆగ్రహం

**ప్రభుత్వానికి ఇది సిగ్గుచేటన్న ధర్మాసనం**

**టీఎంసీ నేత షేక్ షాజహాన్ అకృత్యాలపై మండిపాటు**

**నిందితుడిని పట్టుకునేందుకు 55 రోజులు కాలయపాన**

**మమతా బెనర్జీ ప్రభుత్వ తీరుపై ఆక్షేపణ**

కోల్‌కతా, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై కోల్‌కతా హైకోర్టు గురువారం నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సందేశ్‌ఖాళి ఘటనకు సంబంధించి అఫిడవిట్లపై చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. సందేశ్‌ఖాళిలో టీఎంసీ నేత షేక్ షాజహాన్, అతని అనుచరులు దోపిడీ, భూ కబ్జా, లైంగిక వేధింపుల గురించి బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. షాజహాన్ నుంచి టీఎంసీ ప్రభుత్వం కాపాడటం సరికాదని అభిప్రాయ పడింది. 'సందేశ్ ఖాళిలో జరిగిన దారుణాలపై దాఖలైన ఒక్క అఫిడవిట్ నిజమైనా సరే సిగ్గుచేటు. పశ్చిమ బెంగాల్‌లో అసలు మహిళలకు రక్షణ ఉందా..? మహిళల వేధింపులకు సంబంధించి ఒక్క అఫిడవిట్ రుజువు అయినా సరే రాష్ట్రానికి ఉన్న పేరు పోతుంది. ఇందుకు సందేశ్ ఖాళి జిల్లా యంత్రాంగం, అధికార పార్టీ నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది అని' చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం ఆగ్రహం వ్యక్తం చేశారు. సందేశ్ ఖాళిలో జరిగిన దారుణాలు వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రధాన నిందితుడు షేక్ షాజహాన్‌ను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా ఉన్నారు. అన్ని వర్గాల నుంచి ఒత్తిడి రావడంతో 55 రోజుల తర్వాత అరెస్ట్ చేశారు. ఆ అంశంపై సీజే శివజ్ఞానం మండిపడ్డారు. 'నిందితుడుని పట్టుకునేందుకు ఇంత సమయం ఎందుకు పట్టింది. షాజహాన్‌ను పట్టుకునేందుకు 55 రోజులు ఎక్కడ పరుగెత్తారు. దాగుడు మూతలు ఎక్కడ ఆడారు. మీరు కళ్లు మూసుకుంటే ప్రపంచం నల్లగా మారదు అని' సీజే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ లోని సందేశ్‌ఖాలీ గ్రామం ఇటీవల వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. అధికార తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన షాజహాన్ షేక్, అతడి అనుచరులు.. మహిళలపై అకృత్యాలకు పాల్పడటమే గాక, వారి భూములను బలవంతంగా లాక్కొన్నట్లు వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. ఈ ఘటనలపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై కలకత్తా హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. పౌరుల భద్రతకు ముప్పు ఏర్పడితే.. అందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని స్పష్టంచేసింది. ఈ వివాదంపై దర్యాప్తు జరిపించాలని దాఖలైన అఫిడవిట్‌లపై స్పందిస్తూ.. 'అఫిడవిట్ లో పేర్కొన్న ఒక్క విషయం నిజమైనా, అందులో ఒక శాతం వాస్తవమున్నా అది సిగ్గుచేటు. అధికార పార్టీ, స్థానిక యంత్రాంగం అందుకు పూర్తి నైతిక బాధ్యత వహించాలి' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. అలాగే అరెస్టు తప్పించుకునేందుకు షాజహాన్ షేక్ కొంతకాలంపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 55 రోజుల పాటు షాజహాన్ పరారీలో ఉండడంపై కోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఫిబ్రవరి నెలలో పోలీసులు అతడిని అరెస్టు చేసిన



సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఇదిలాఉంటే, షాజహాన్ అకృత్యాలకు ఎదురొడ్డి నిలిచిన రేఖా పత్రా.. అక్కడి మహిళలు చేపట్టిన ఆందోళనలకు నాయకత్వం వహించారు. అతడి అనుచరుల బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడమే గాక.. కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆమెకు బెంగాల్‌లోని బసిర్‌హట్ స్థానం నుంచి భాజపా టికెట్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్

## మంత్రిమండలిలో పిన్న వయస్కుడైన జగ్జీవన్ రామ్ అందరూ 'బేబి మినిస్టర్' అని పేరుతో పిలిచేవారు

రాజేంద్రనగర్,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం):ఆనాటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న..పీడిత దళిత దీన జనుల కోసం శ్రమించిన సంస్కరణల యోధుడు జగ్జీవన్ రామ్.ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.భారతదేశంలో వలసవాదానికి,సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్రోద్యమ పోరాటంతో పాటు కుల నిర్మూలన,సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో కీలకంగా పని చేసిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్.భారత దేశ స్వరాజ్య ఉద్యమంతో పాటు తదనంతరం జరిగిన దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన ఆయన జీవితం..రాజకీయ,సామాజిక,చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉన్నది.1908 ఏప్రిల్ 5వ తేదీన జగ్జీవన్ రామ్ బీహార్లోని షాబాద్ జిల్లాలోని చిన్న గ్రామమైన చంద్వాలో వసంతాదేవి,శోభిరామ్ దంపతులకు జన్మించారు.దళిత కులంలో పుట్టిన ఆయన పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు చురుకైన విద్యార్థిగా రాణించారు.జగ్జీవన్ రామ్1922లో ఆరా పట్టణంలోని స్కూలులో చదువుతున్నప్పుడు కుండలో నీరు తాగడానికి వెళ్తే..ఆధిపత్య కులాల విద్యార్థులు అడ్డుకున్నారు.అలా మొట్టమొదటి సారిగా ఆయన అవమానాన్ని ఎదుర్కొన్నారు.దళితులకు పాఠశాలల్లో ప్రత్యేక మంచి నీటి కుండను ఏర్పాటు చేయడాన్ని సహించలేక అక్కడున్న అన్ని కుండలను పగలగొట్టి నిరసన తెలిపారు.వివక్షను ఎదుర్కొంటూనే ఫస్ట్ క్లాసులో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు.బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య కొనసాగించారు.1931లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీలో పట్టా తీసుకున్నారు.బాబు జగ్జీవన్ రామ్ కలకత్తాకు వెళ్లిన ఆరునెలల్లోనే విల్లింగ్టన్ స్క్వేర్ ముప్పై వేల మంది కార్మికులను కూడగట్టి భారీ ర్యాలీ తీసే స్థాయికి చేరుకున్నారు.దాంతో ఆయన సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి చాలామంది జాతీయ నాయకుల దృష్టిని ఆకర్షించగలిగారు.కమ్యూనిస్టు మేనిఫెస్టో,పెట్టుబడిదారీ గ్రంథాలతో పాటు ఇతర సోషలిస్టు సాహిత్యం అధ్యయనం చేశారు. కులరహిత,వరరహిత భావజాలం కలిగిన జగ్జీవన్రామ్పై ఇవి ఎంతగానో ప్రభావం చూపాయి.బ్రిటిష్ వలసవాద సంకెళ్లు తెంపి,దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలని,సామాజిక సమానత్వం నిర్మించాలని ఆయన విద్యార్థి దశలోనే భావించేవారు.ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి కోసం..1934లో జగ్జీవన్రామ్ కలకత్తాలో అఖిల భారతీయ రవిదాస్ మహాసభను స్థాపించారు.దళితుల సాంస్కృతిక 'కులగురు' అయిన 'గురు రవిదాస్' జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అనేక జిల్లాల్లో రవిదాస్ సమ్మేళనాలు చేపట్టారు.సాంఘిక సంస్కరణ కోసం వ్యవసాయ కార్మిక మహాసభను,ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ మొదలైన సంఘాలను



నెలకొల్పారు.ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ,మరోవైపు సాంఘిక సంస్కరణల కోసం రాజకీయ ప్రాతినిధ్యం వహించిన గొప్ప మేధావి జగ్జీవన్రామ్.బీహార్లో 1934లో వచ్చిన భయంకరమైన భూకంపం సందర్భంగా జగ్జీవన్రామ్ ప్రజలకు సహాయ,పునరావాస చర్యలు చేపట్టారు. ఈ సందర్భంలో మొదటిసారిగా గాంధీజీతో పరిచయం ఏర్పడింది.1935లో కాన్పూర్లో జరిగిన డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ కాన్ఫరెన్స్కు జగ్జీవన్రామ్ అధ్యక్షత వహించారు.ఆరు సంవత్సరాలు పాటు అధ్యక్షుడిగా వ్యవహరించి దేశంలోని షెడ్యూల్డ్ కులాలు,షెడ్యూల్డ్ తెగల హక్కులు,అభివృద్ధి కోసం ఆయన తీవ్రంగా కృషి చేశారు.పార్టీని స్థాపించి..1969లో అధికార కాంగ్రెస్ పార్టీకి జగ్జీవన్రామ్ అధ్యక్షుడయ్యారు.1977లో ఇందిరాగాంధీ నియంతృత్వ విధానంతో విభేదించి,కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు ప్రకటించి బయటకు వచ్చిన ఆయన 'ప్రజాస్వామ్య కాంగ్రెస్'(కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ) అనే పార్టీని స్థాపించారు. తర్వాత దాన్ని జనతా పార్టీలో విలీనం చేశారు.మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా కేంద్రంలో జనతాపార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో(1977) జగ్జీవన్రామ్ కేంద్ర రక్షణశాఖ మంత్రిగా విధులు నిర్వహించారు.1979 జనవరి 24న డిప్యూటీ ప్రధానమంత్రిగా జగ్జీవన్రామ్ బాధ్యతలు స్వీకరించారు.దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేయడంలో జగ్జీవన్రామ్ కీలక పాత్ర పోషించారు.1950లో సికింద్రాబాద కర్బలా మైదానంలో జరిగిన గొప్ప బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు.1976లో జరిగిన ఆంధ్రప్రదేశ్ హరిజన మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జగ్జీవన్ రామ్ గొప్ప దార్శనికత,అనుభవం ఉన్న రచయిత.ఆయన హిందీ,ఇంగ్లీష్ లో రచనలు చేశారు.భారతదేశంలో కులం సవాళ్లు,జీవన సరళి వ్యక్తిత్వ వికాసం అనే రెండు పుస్తకాలు రాశారు.ఆయన గొప్ప సేవలకు గాను ఉజ్జయినిలోని విక్రమ విశ్వవిద్యాలయం 1967లో జగ్జీవన్రామ్కి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' అనే గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేసింది.1968లో కాన్పూర్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్తో సత్కరించింది.మూఢనమ్మకాలు, సామాజిక వివక్ష,అసమానతలు లేని స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య సోషలిస్టు సమాజ నిర్మాణం జగ్జీవన్రామ్ దార్శనికతలో రూపుదిద్దుకున్నదే. 1986 జులై 6వ తేదీన బాబూజీ భౌతికంగా మనల్ని వీడారు.యావత్తు భారత జాతి ఆయనకు ఘనంగా నివాళు లర్పించింది.ఈ దేశం ఎప్పటికీ గుర్తుంచుకోగల నాయకుడు, సామాజిక, రాజకీయ బానిసత్వాలపై జీవితాంతం యుద్ధం చేసిన బాబూజీ ఇప్పటికీ స్ఫూర్తి దాత.స్వాతంత్ర్య పోరాటంలో..1936లో బీహార్ శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికై 28 ఏండ్ల వయసులో జగ్జీవన్రామ్ తన రాజకీయ జీవితం ప్రారంభించారు.1937 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ నుంచి14 రిజర్వుడ్ స్థానాలకు జగ్జీవన్రామ్ అభ్యర్థులను పోటీకి నిలిపారు.ఆఎన్నికల్లో ఎలాంటి పోటీ లేకుండా14 మంది అభ్యర్థులు గెలవడంతో జగ్జీవన్రామ్ ఒక రాజకీయ నిర్ణయాత్మకశక్తిగా,కింగ్మేకర్గా ఎదిగారు.ఈ సమయంలోనే తమతో చేతులు కలపాల్సిందిగా "కాంగ్రెస్ పార్టీ" నుంచి జగ్జీవన్రామ్కు ఆహ్వానం అందింది.1942లో ఆయన బొంబాయిలో అగ్రనేతల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.అప్పుడే కాంగ్రెస్ పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసింది.స్వాతంత్ర్యమో లేక మరణమో!','సాధించు లేదా మరణించు!'నినాదాలు దేశమంతటా వ్యాపించాయి.ఆలిండియా 'డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్'ను కూడా బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది.ఆ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని పాట్నాలోని స్వగృహంలో జగ్జీవన్రామ్ అరెస్టు అయ్యారు.1943 అక్టోబర్ బ్రిటిష్ ప్రభుత్వ అణచివేతల్ని ఖండిస్తూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం అనేక సభలు,సమావేశాలు,ర్యాలీలు నిర్వహించారు.1946 ఆగస్టు 30న భారతదేశంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా బ్రిటిష్ వైస్రాయి ఆహ్వానించిన పన్నెండుమంది దేశ నాయకుల్లో జగ్జీవన్రామ్ ఒకరు.1946 సెప్టెంబర్ 2న ఏర్పాటు చేసిన మధ్యంతర ప్రభుత్వంలో కార్మికశాఖ మంత్రిగా,అణగారిన సామాజికవర్గాలకు ఏకైక ప్రతినిధిగా ఆయన నిలిచారు.మంత్రిమండలిలో పిన్న వయస్కుడైన జగ్జీవన్రామ్ను అందరూ 'బేబి మినిస్టర్' అని పిలిచేవారు.33 ఏండ్లకు పైగా కేంద్రకేబినెట్ మంత్రిగా,దేశ ఉపప్రధానమంత్రి గానూ డాక్టర్ బాబు జగ్జీవన్రామ్ తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి.ముఖ్యంగా కేంద్ర%జ%వ్యవసాయ,ఆహార శాఖ మంత్రిగా ఆయన దేశంలోని ఆహార సమస్యల పరిష్కారం కోసం హరిత విప్లవానికి నాంది పలికారు.



నూతన వధూవరులతో మాజీ మంత్రి సబితా రెడ్డి

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సబితా ఇంద్రారెడ్డి

శంషాబాద్, ఏప్రిల్ 4( ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలో గురువారం జరిగిన కొలను వారి వివాహ వేడుకలకు రాష్ట్ర మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణ ప్రముఖుడు బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు కొలను రమణారెడ్డి కూతురు హరీష రెడ్డి వివాహము సాయి కిరణ్ రెడ్డి తో శంషాబాద్ లోని జెడి కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకలతో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. కాంటెస్టెడ్ ఎమ్మెల్సీ బుక్కా వేణుగోపాల్. కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా. మున్సిపల్ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. మండల పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్ర రెడ్డి. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్. కొలను గురువారెడ్డి పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## కార్మికులతో వెట్టి చాకిరి పనులు చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

### రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

రాజేంద్రనగర్,ఏప్రిల్4(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పనిచేస్తున్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ లను వెట్టి చాకిరి చేయిస్తున్నారని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ లు 33 మంది కార్మికులు విధులు నిర్వహిస్తారని వీరు ఉదయం 5 గంటలకు వచ్చి పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకోవాలి. బస్తీలలో పారిశుద్ధ్యం చేయించాలి మధ్యాహ్నం 1గంట నుంచి 2గంటల వరకు పారిశుద్ధ్య కార్మికుల హాజరు తీసుకోవాలి. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో మీటింగులు ఏర్పాటు చేసి వీక్లీ సెలవు ఉన్నా మీటింగ్ కు రాకపోతే పెనాల్టీలు చేస్తామని అధికారులు బెదిరిస్తారని తెలిపారు. వీక్లీ సెలవు తీసుకోవాలంటే ఉదయం ఐదు గంటలకే వచ్చి పారిశుద్ధ్య పనులు చేయించాలి.బస్తిలో చెత్త సేకరణ పిన్ పాయింట్ చేయాలి మళ్లీ నైట్ డ్యూటీ చేసి వీక్లీ సెలవులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. నైట్ డ్యూటీ చేస్తే కార్మికులకు ఓటి ఇస్తారా అంటే అదేమీ లేదు కార్మికులతోటి వెట్టి చాకిరి చేస్తున్నారు.రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో 8 గంటల పని విధానాలు అమలు చేయడం లేదు. ఎప్పుడు లేని విదంగా అధికారులు కార్మికుల మీద పనిభారం మోపుతున్నారు. ఎస్ఎఫ్ఐ లకు నైట్ డ్యూటీ చేస్తే ఓటి ఇస్తారా అంటే అది అమలు చేయరు. కార్మికులని కట్టు బానిసల్లాగా పని చేయిస్తున్నారు. ఇది బ్రిటిష్ మరియు రజాకర్ల పరిపాలన లాకా ఉంది. పోరాడి సాధించు కున్న కార్మిక చట్టాల హక్కులను ప్రభుత్వ రంగ సంస్థలోనే తుంగలో తొక్కుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 8 గంటల పని దినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.



రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

## బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రనగర్ బార్ నూతన అసోసియేషన్ కార్యవర్గం

### బాధ్యతతో బార్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తా:బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్,ఏప్రిల్ 04(ప్రభాత ఉదయం) ఇటీవల ఎన్నికైన రాజేంద్రనగర్ ఉప్పరపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం బాధ్యతలను స్వీకరించారు.ఉప్పరపల్లి కోర్టు సమావేశం మందిరంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా టీఎల్.శ్రీధర్ రెడ్డి,ఉపాధ్యక్షుడిగా ఆర్.వెంకటేశం,జాయింట్ సెక్రటరీగా తులసి రామ్ నాయక్,క్రీడా సంస్కృతి కార్యదర్శిగా కె.ప్రవీణ్ కుమార్,కోశాధికారిగా పి.రాజశేఖర్,లైబ్రేరియన్ సెక్రెటరీగా కృష్ణ,కార్యనిర్వాహక సభ్యులుగా గుమీత్ సింగ్,ప్రతాప్ గౌడ్,శశికాంత్ రెడ్డి,జయకృష్ణ,లేడీ రెప్రజెంటేటివ్ గా భానుప్రియలకు పదవీ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు శీలం వెంక రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి తనకు అవకాశం కలిగించిన న్యాయవాదుల అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.తనకు ఈ అవకాశం కల్పించినందుకు బాధ్యతతో బార్ అభివృద్ధికి సమిష్టిగా పాటు పడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించలేని రంజిత్ రెడ్డి చేవెళ్ల ఎలా అభివృద్ధి చేస్తారు

### రంజిత్ రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డిలకు సొంత పనిలే తప్ప నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోరు: గుర్రం అనంతరెడ్డి



శంషాబాద్, ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వీరి వల్ల ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని వారి సొంత పనులు చక్కగా పెట్టుకోవడానికి ఎన్నికల్లో పోటీ చేసి పార్టీలు మారుతున్నారని గుర్రం చిన్నానంతరెడ్డి ఆరోపించారు . గతంలో ప్రాతినిధ్యం వహించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డికి ప్రజా సమస్యలు పట్టవని వారి వ్యాపారాలు వృద్ధి చేసుకోవడం కోసం. సొంత ఆస్తులు కాపాడుకోవడం కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్న గోల్కొండ సహకార సంఘం డైరెక్టర్ గుర్రం చిన్న అనంతరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిన్న గోల్కొండ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం. విద్యార్థులకు భోజనశాల నిర్మించాలని ఎంపీ రంజిత్ రెడ్డికి పలుసార్లు విన్నవించిన పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీసం మరుగుదొడ్లు నిర్మించడానికి సహకరించని వ్యక్తి చేవెళ్ల అభివృద్ధికి ఎలా కృషి చేస్తారని ఆయన ప్రశ్నించారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ప్రస్తుత ఎంపీ రంజిత్ రెడ్డి ఇద్దరు కూడా టిఆర్ఎస్ పార్టీ నుండి విజయం సాధించినప్పటికీ తమ రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలోకి మారారని అన్నారు. మళ్లీ పార్టీలు మారి పోటీ చేస్తున్న వీరికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు.. మూడవసారి కూడా ప్రజలు టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్ ను గెలిపించాలని అనంతరెడ్డి కోరారు. శంషాబాద్ పట్టణంలోని సిద్ధాంతి వద్ద అండర్పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయడంలో రంజిత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని దీనితో ఆ ప్రాంత ప్రజలు రోడ్డు దాటడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ఇద్దరు నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జిగా రాచమల్ల సిద్దేశ్వర్



శంషాబాద్,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం) రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉప్పల్ శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను పిసిసి పంచాయతీరాజ్ విభాగం ఇన్చార్జి శంషాబాద్ మాజీ సర్పంచ్ రాచమల్ల సిద్దేశ్వర కు పార్టీ అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గం లో తిరిగి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని భావించిన అధిష్టాన వర్గం పలువురు నాయకులకు పార్టీ బాధ్యతలను అప్పగిస్తూ గురువారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను సీరియస్ గా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయా ప్రాంతాల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయడం కోసం ప్రత్యేకంగా ఇన్చార్జిలను నియమించింది. ఈ సందర్భంగా సిద్దేశ్వర్ మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గం అభ్యర్థి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉప్పల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అత్తాపూర్ డివిజన్ బి ఆర్ ఎస్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి

## రాజేంద్రనగర్‌లో బిఆర్ఎస్ ఖాళీ

### కాంగ్రెస్ లో చేరిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మిద్దెల సురేందర్ రెడ్డి

### కాంగ్రెస్ పార్టీలో చేరటానికి క్యూ కట్టిన బి ఆర్ఎస్ నాయకులు

రాజేంద్రనగర్,ఏప్రిల్04(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ లో త్వరలో భారత్ రాష్ట్ర సమితి క్యాడర్ ఖాళీ కానుందని స్పష్టం అవుతోంది. పార్లమెంట్ ఎన్నికల ముంగిట తెలంగాణ రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి.ఎన్నికల సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలోకి ఊహించనివిధంగా చేరికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలువురు కీలక నేతలు హస్తం గూటికి చేరగా గురువారం రాజేంద్రనగర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అత్తాపూర్ డివిజన్ కు చెందిన మిద్దెల సురేందర్ రెడ్డి అనుచరవర్గంతో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోకాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హస్తం కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.రాజేంద్రనగర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకుల కాంగ్రెస్ లోకి చేరడంతో అటు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది.పార్లమెంట్ ఎన్నికల ముందు కీలక నేతలు చేజారుతుండటంతో బీఆర్ఎస్ వర్గంలో ఆందోళన మొదలైంది.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారన్నారు.నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న చేవెళ్ల అభ్యర్థి రంజిత్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రంజిత్ రెడ్డి లాంటి నాయకుడు దొరకడం చేవెళ్ల పాలమెంట్ ప్రజల అదృష్టమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర శంకర్, పీఎం రెడ్డి,శివారెడ్డి,రజనీకాంత్ రెడ్డి ,ఆనంద్,శ్రీధర్ రెడ్డి,మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్‌లో నేడు

## శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కళ్యాణ మహోత్సవం

### భక్తులు భారీగా తరలి రావాలి: వ్యవస్థాపక ధర్మకర్తలు రాపోలు కృష్ణకుమారి పెంటన్న



శంషాబాద్, ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు రాపోలు కృష్ణకుమారి పెంటన్న తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని కుమ్మరి బస్తీలో శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి విగ్రహ ప్రతిష్టాపన చేసి 9 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కుజ గురు శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణము. విశ్వక్సేన ఆరాధన. అనంతరం 11:30 నిమిషాలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుపుతున్నట్లు కృష్ణ కుమారి పెంటన్న తెలిపారు. శ్రీ మంగళగిరి చెల్లయ్య ఆచార్యుల వారి ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.



శ్రీనివాస్ చారి - నందిని వివాహం సందర్భంగా వారిని కలిసి ఆశీర్వదిస్తున్న పాత్రికేయులు, కుటుంబ సభ్యులు

## ఘనంగా శ్రీనివాస్ చారి-నందినిల వివాహ వేడుకలు

బుద్వేల్, ఏప్రిల్4(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వాస్తవ్యులు కల్లోజి నరసింహ చారి - దివంగత కల్లోజీ కృష్ణకుమారి (దేవి)ల ద్వితీయ కుమారుడు కల్లోజి శ్రీనివాస్ చారి వివాహము గురువారం రామచంద్రపురం మండలం ఈదుల నాగులపల్లి గ్రామానికి చెందిన కమ్మరి స్వాతి, దివంగత కమ్మరి బాలా చారి కుమార్తె నందిని తో జరిగింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు గ్రామం లోని బీఆర్ జీ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకలలో ఇరు కుటుంబాలకు చెందిన వందలాది మంది బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. మెదక్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు తో పాటు వివిధ పార్టీల నాయకులు వివాహానికి హాజరయ్యారు. వివాహ వేడుకలలో ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి తో పాటు సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, మెక్కొండ ప్రేమ్ రాజ్, గద్దె యాదగిరి, బీజే వై ఎం రాష్ట్ర ప్రచార కార్యదర్శి కె. కిరణ్ చారి, పెళ్లి కుమారుని సోదరుడు కె. రమేష్ చారి, వదిన స్నేహ ప్రియ, సోదరి జ్యోతి లు పాల్గొన్నారు.



శ్రీనివాస్ చారి-నందినిల వివాహ వేడుకలలో కాంగ్రెస్ నాయకులు నీలం మధు, తదితరులు

ప్రభాత ఉదయం

# ఎన్నికల్లో వాగ్ధానాలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

## మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



బోయిన్‌పల్లి,ఏప్రిల్4(ప్రభాత ఉదయం)ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని వాగ్ధానాలు ఇచ్చి.. ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఫైర్ అయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆరు, ఏడు వార్డులలో నిర్వహించిన ఎన్నిక ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ నేత సదాకేశవరెడ్డి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి తన స్థానమే అని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.మల్కాజ్‌గిరి రేవంత్‌రెడ్డి జాగీరు కాదని.. ఇది ప్రజల జాగీరు అని ధ్వజమెత్తారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి నియోజవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని స్పష్టం చేశారు. కనీసం కార్పొరేటర్, ఒక కౌన్సిలర్, ఓ ఎమ్మెల్యేను కూడా గెలిపించుకోలేక పోయాడని ఎద్దేవా చేశారు. ఏ కాలనీ బస్తీ వారైనా.. ఈసారి మళ్లీ నరేంద్ర మోడీకే ఓటు వేసి మూడోసారి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంటు సీటు కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదని ఆరోపించారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని అన్నారు.ఒక పార్టీ గుర్తుపై గెలిచి, ఆ పార్టీకి రాజీనామా చేయకుండా, వేరే పార్టీలో చేరితే రాళ్లతో కొట్టి చంపాలన్న రేవంత్ రెడ్డి ఇతరులను కాంగ్రెస్ పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల మనిషినని, మల్కాజ్‌గిరిలో బీజేపీ జెండా ఎగురవేసి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ టీఎన్ వంశ తిలక్, మాజీ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు భానుక నర్మద మల్లికార్జున్, సుస్మిత శంకర్ రావు, పిట్ల నాగేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాత్రి పూట వరుస దొంగతనాలపై వీధి పోలీసులను కేటాయించాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు

గద్వాల,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాపై పోలీసుల వైఫల్యాలు స్పష్టంగా కన్పిస్తున్నాయిని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో అనేక దొంగతనాలు జరిగాయని, ఇప్పటివరకు ఎంత మంది దొంగలపై, క్రిమినల్స్ పై చర్యలు తీసుకున్నారో ప్రజలుకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. పోలీస్ శాఖ వారు ఆటోల ద్వారా దొంగతనాలపై, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రచారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు మొదలయ్యాయన్నారు. రాత్రి పూట వీధులలో పెట్రోలింగ్ పోలీసులను ఏర్పాటు చేయాలని, అంతే గాకుండా పోలీసులు నిఘా పర్యవేక్షణ చేయాలని కోరారు. రాత్రి వేళలో అత్యవసర సమయంలో ప్రత్యేక పోలీస్ టీమ్ కేటాయించి, పోలీస్ శాఖ వారి నంబర్ ను ప్రజలకు అందుబాటులో తెచ్చి స్పాట్ లో వెళ్లి బాధితులకు రక్షణ కల్పించే విధంగా ఉండాలన్నారు. జిల్లా ఏర్పడిన కొత్తలో దొంగతనాలు, దౌర్జన్యాలపై అప్పటి అధికారులు ఉక్కుపాదం మోపారని గుర్తుతెచ్చారు. న్యాయం కోసం జిల్లా పోలీసులను ఆశ్రయించే వారికి అండగా నిలవాలని జిల్లా పోలీసులను కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అశన్న,కాశీం, ప్రవీణ్, అనుమేష్ తదితరులు పాల్గొన్నారు.




# బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కుమార్ యాదవ్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం) బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ కు చెందిన కుమార్ యాదవ్ ను బిజెపి రాష్ట్ర కార్యవర్గం నియమించింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా నియమింపబడిన కుమార్ యాదవ్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ కూడా కుమార్ యాదవ్ కు అభినందనలు తెలిపి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలుపారని కుమార్ యాదవ్ అన్నారు. అలాగే రాష్ట్ర కమిటీలో అవకాశం దొరికినందుకు సంతోషమని ఇచ్చిన బాధ్యతను గొప్ప అవకాశం గా భావించి పార్టీ పటిష్టత కోసం రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు. అలాగే అందరి సహకారంతో ముందుకు సాగడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మల్కాజిగిరి గడ్డ... కాంగ్రెస్ అడ్డా

## ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్



కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం) పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్ రెడ్డి ని ఏ విధంగా అయితే ఇక్కడ గెలిపించుకున్నామో అదేవిధంగా యావత్ మల్కాజిగిరి యువత మొత్తం మీ వెంట ఉండి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని మల్కాజిగిరి గడ్డ కాంగ్రెస్ అడ్డా అనే విధంగా నిరూపిస్తామని పట్నం సునీత మహేందర్ రెడ్డి కి గొల్ల జాన్ హామీ ఇచ్చారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



గద్వాల,ఏప్రిల్4(ప్రభాత ఉదయం) విద్యుత్ షాట్ సర్క్యూట్ తో ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..అంబేద్కర్ చౌరస్తాలో ఓ కాంప్లెక్స్ కిరాణం షాపు నడుపుకొని జీవనోపాధి పొందుతున్న శంకరయ్య అదే కాంప్లెక్స్ పై అంతస్తులో నివసిస్తున్నాడు. గురువారం సాయంత్రం షాట్ సర్క్యూట్ జరుగడంతో మంటల చెలరేగాయి. ఒక్క సారి ఇంట్లో నుండి భారీ శబ్దం వినిపించడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న దుస్తులు, వంటసామాగ్రి, ఇతర విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించి రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న పలిమార్ పీఠాధిపతి

మల్దకల్,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం) ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఉడిపి పలిమర్ పీఠాధిపతులు శ్రీ విద్యాదీశ తీర్థ స్వామీజీ గురువారం సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టలకు హాజరైన స్వామీజీ సాయంత్రం మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకోగా వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ వేద పాఠశాల సందర్శించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు, మద్వేష, బాబురావు, నాగరాజు శర్మ, వెంకోబా రావు, చంద్రశేఖర రావు, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్, మధు,బాదామి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

గద్వాల,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం) డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల కారు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన గురువారం గట్టు మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గట్టు మండలం చాగదోణ నుంచి బలిగెరకు వెళ్లుతున్న ఎపి 13ఎం 8665 నంబర్ గల కారు బలిగెర శివారులో గౌనికుంట వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నది. అయితే కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సమయంలో విద్యుత్ స్థంభం విరిగిపోవడం, విద్యుత్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురైయ్యారు. కాగా స్థానికుల సమాచారం ప్రకారం డ్రైవర్ నిర్లక్ష్యంగా కారును నడపడం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ ఘటనలో గాయాలైన డ్రైవర్ ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.



# వాహనాల తనిఖీల్లో ఏలాంటి రశీదులు లేని రూ. 4,73,500 నగదు సీజ్

గద్వాల,ఏప్రిల్ 3(ప్రభాత ఉదయం)పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల పరిధిలో, సరిహద్దు చెక్ పోస్టు లలో పోలీస్ అధికారులు విస్తృతంగా లవాహనాల తనిఖీలు చేపట్టి రూ.4,73,500 నగదు సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటికి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. గట్టు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి రశీదులు లేని రూ.2,76,000, ఉండవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లూరు చెక్ పోస్టు నందు రూ.1,97,500 రూపాయలను సీజ్ చేయడం జరిగిందన్నారు. మొత్తం రూ.4,73,500 చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి పోలీస్ అధికారులు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా పరిధిలో ఎవరైన 50 వేల రూపాయల కొద్దీ ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్తే తగిన రశీదులు ,పత్రాలు వాటి వివరాలు వెంట తీసుకెళ్ళాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.



# తుక్కుగూడ సభ ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 4(ప్రభాత ఉదయం)లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఏప్రిల్ 6న తుక్కుగూడ వేదికగా ప్రచార శంఖం పూరించనుంది. 'జన జాతర' పేరుతో నిర్వహించనున్న ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారు.ఈ క్రమంలో తుక్కుగూడ సభపై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పిసిసి మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్.. సభా ప్రాంగణానికి వెళ్లి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ గడ్డపై ప్రకటించే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో భారతావని దశ దిశ మార్చనుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

# బిజెపి బూత్ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

## వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో కూకట్ పల్లి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శ్రీకర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ శుక్రవారం కూకట్ పల్లి ఎన్.కే.ఎన్.ఆర్ గార్డెన్స్ లో నిర్వహించబోతున్న బూత్ స్థాయి, ఆపై స్థాయి నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు తప్పక పాల్గొనాలని సూచించారు. నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా నాయకులు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, వివిధ మోర్చా నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లో రాణించినప్పుడే రాష్ట్ర పురోగతి సాధ్యమవుతుంది

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ గౌడ్ కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 4 (ప్రభాత ఉదయం) సమాజ శ్రేయస్సు కోసం యువత ముందుకు రావాలని, రాజకీయాల్లో యువత రాణించినప్పుడే రాష్ట్ర పురోగతి లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శేలింగంపల్లి నియోజకవర్గం లోని ఆల్విన్ కాలనీ డివిజన్ కు చెందిన యువనేత రామకృష్ణ గౌడ్ ను చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువనేత రామకృష్ణ గౌడ్ కు, అనిల్ రెడ్డి కు పార్టీ కండువా వేసి అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి రంజిత్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.